నమస్తే తెలంగాణ
మహబూబ్‌నగర్
నారాయణపేట
5 | మహబూబ్‌నగర్, బుధవారం 9 ఏప్రిల్ 2025 | MAHABUBNAGAR NARAYANPET

నాడు కళ నేడు వ్యథ

- కళావిహీనంగా పల్లెప్రకృతి వనాలు

మహబూబ్‌నగర్ జిల్లా వాడ్యాలలో చెట్లు ఎండిపోవడంతో కళావిహీనంగా పల్లె ప్రకృతి వనం

- పట్టించుకోని అధికారులు

నాగర్‌కర్నూల్ జిల్లా నందివడ్డెమాన్ పల్లెప్రకృతి వనంలో ఎండుతున్న చెట్లు

పచ్చని చెట్లతో ఆహ్లాదకరంగా.. పలురకాల పూల సోయగాలతో కేసీఆర్ ప్రభుత్వంలో కళకళలాడిన పల్లెప్రకృతి వనాలు.. నేడు ఆలనా.. పాలన కరువై కళావిహీనంగా దర్శనమిస్తున్నాయి. మొక్కలు ఎండిపోయినా.. పలు చోట్ల ధ్వంసమైనా.. వనాల రక్షణకు ఏర్పాటు చేసిన ఫెన్సింగ్ తొలగిపోయినా.. అధికారులు పట్టించుకోవడం లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. నాగర్‌కర్నూల్ జిల్లా నందివడ్డెమాన్, మహబూబ్‌నగర్ జిల్లా వాడ్యాలలో ప్రకృతి వనాల్లో చెట్లు ఎండిపోయాయి. మొక్కలు ప్రాణాలు కోల్పోతున్నా.. కంచెలు కూలిపోతున్నా పంచాయతీ అధికారులు తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తుండటం బృహత్ వనాల దుస్థితికి అద్దం పడుతున్నది. మొక్కలు రీప్లేస్‌మెంట్ చేయకపోవడంతో వనంలో ఎటు చూసినా ఎండిన మొక్కలే దర్శనమిస్తున్నాయి. దీంతో వనాలన్నీ ఇంత గడ్డు పరిస్థితులను ఎదుర్కొంటున్నాయి.

– మహబూబ్‌నగర్/నాగర్‌కర్నూల్ ఫొటోగ్రాఫర్లు

పాలమూరుకు అన్యాయం

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు నాగం జనార్దన్‌రెడ్డి

- నల్లగొండకు నీటి తరలింపు
- అడ్డుకోలేకపోతున్న కాంగ్రెస్ ప్రజాప్రతినిధులు
- పాలమూరు బిడ్డగా చెప్పకునే సీఎం రేవంత్‌రెడ్డికి పట్టదా ?
- పాలకులు శాశ్వతంగా గుర్తుండి పోయేలా పనులు చేయాలి
- బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు, మాజీ మంత్రి నాగం జనార్దన్‌రెడ్డి

నాగర్‌కర్నూల్, ఏప్రిల్ 8 : ఉమ్మడి పాలమూరు జిల్లాలో నీటి వనరు అయిన పాలమూరు-రంగా రెడ్డిప్రాజెక్టు పరిధిలో ఏదుల రిజర్వాయర్ నుంచి నల్లగొండకు నీటిని తరలించుకు పోతుంటే ఉమ్మడి పాలమూరు జిల్లా కాంగ్రెస్ పాలకులకు పట్టింపు లేకుండా పోయిందని, ఇక్కడి రైతులకు అన్యాయం చేస్తూ నల్ల గొండకు నీటి తరలింపును ఏ ఒక్క నాయకుడు అడ్డుకోలేక పోతున్నారని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు నాగం జనార్దన్‌రెడ్డి అన్నారు. మంగళవారం నాగర్‌కర్నూల్‌లోని తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ అక్రమంగా నీటి తరలింపుపై మండిపడ్డారు. ఉమ్మడి పాలమూరు జిల్లాలోని ప్రజాప్రతినిధులు సైతం రైతులు, ప్రజలకోసం కాకుండా స్వప్రయోజనాలకోసం పాలన సాగిస్తున్నట్లుగా ఉందన్నారు. పాలమూరు బిడ్డగా చెప్పుకుంటున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తన సొంత ఉమ్మడి జిల్లా రైతులకు అన్యాయం చేసేలా నీటి తరలింపు జరుగుతున్నా ఎందుకు పట్టించుకోవడం లేదన్నారు. ఏదుల నుంచి నల్లగొండకు నీటి తరలింపుతో ఉమ్మడి పాలమూరు జిల్లా ప్రజలు, రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటాయని, దీనిని దృష్టిలో ఉంచుకొని మూకుమ్మడిగా పాలకులు నీటి తరలింపును అడ్డుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ప్రస్తుతం సమస్య తెలియడం లేదని, ముమ్ముందు మరింత తీవ్రంగా నష్ట పోతామని, నల్లగొండకు నీటి తరలింపు జరిగితే సాగు, తాగునీటికి తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తుందన్నారు. పాలమూరు-రంగా రెడ్డి ప్రాజెక్టు పరిధిలోని 12 లక్షల 30 ఎకరాలకు సాగునీటిని అందించేందుకు జీవో ఇచ్చినా కేవలం 7 లక్షల ఎకరాలకు మాత్రమే నీటిని అందించేందుకు చూస్తున్నారన్నారు. అందులోనూ మరింత కోత పెట్టేందుకు నల్ల గొండకు ఏదుల రిజర్వాయర్ నుంచి నీటి తరలింపునకు పూనుకోవడం ఇక్కడి పాలకుల నిర్లక్ష్యమన్నారు. నీటి తరలింపు ఆపేందుకు ఉమ్మడి పాలమూరు జిల్లాలోని ఎంపీలు, ఎమ్మెల్యేలు ముఖ్యమంత్రి కొట్లాడాల్సిన అవసరం ఉందన్నారు. ముఖ్యంగా ప్రాజెక్టులపై అవగాహన లేకపోతే తెలుసుకోవాలని, మన అవగాహన లేమితో నీటి తరలింపును అడ్డుకోలేక పోతే సమస్యలు తీవ్రమవుతాయన్నారు. ఒకప్పుడు నీటి తరలింపు వద్దని సంతకాలు పెట్టిన నాయకులు ఇప్పుడు నోరు మెదపడం లేదని, అచేతనులయ్యారా అని ప్రశ్నించారు. ప్రాజెక్టుల గురించి అర్థం కాకపోతే తాను ఎక్కడకు రమ్మంటే అక్కడికి వచ్చి నీటి తరలింపుతో ఉమ్మడి పాలమూరు జిల్లాకు జరిగే అన్యాయాన్ని వివరిస్తారని, పాలకులకు అర్థమయ్యేలా చెబుతానని నాగం పేర్కొన్నారు. ప్రభుత్వానికే ప్రాజెక్టులపై అవగాహన లేదని, నల్ల గొండకు చెందిన ఓ రిటైర్డ్ ఇంజినీర్ చెప్పినట్లుగా చేస్తూ మన ప్రాంతంపై సవతి తల్లి ప్రేమ చూపిస్తున్నారన్నారు. ప్రజలు, రైతులు మనల్ని నమ్మి గెలిపించుకున్నందుకు వారి బాగుకోసం, అభివృద్ధి కోసం శాశ్వతంగా గుర్తుండే పనులు చేసినపుడే నిజమైన పాలకుడవుతాడన్నారు. పదవులు వచ్చిపోయేవేనని, ఉన్న పదవి కాలంలో ఏం పనులు చేస్తున్నామన్నది ప్రజలు గుర్తుంచుకుంటారన్నారు. నీటి తరలింపు విషయంలో ఇప్పటికైనా పాలకులు, ప్రభుత్వం పట్టించుకోక పోతే ప్రజల్లో అవగాహన కల్పించి నీటి తరలింపు అడ్డుకునేందుకు ఉద్యమిస్తామన్నారు. ప్రాజెక్టులోని మొదటి నుంచి నీటిని తరలించుకు పోతే వట్టెం, కర్వెన, ఉదండాపూర్ ప్రాజెక్టుల పరిధిలోని రైతులు, ప్రజలకు నీటి కష్టాలు తప్పవన్నారు. సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు అర్థం రవి, బాలగౌడ్, లక్ష్మయ్య, అర్జునయ్య పాల్గొన్నారు.

డిండి ప్రాజెక్టు బ్యాక్ వాటర్..

మండలంలోని గాజర గ్రామ రైతులు డిండి ప్రాజెక్టు వెనుక భాగంలో ఆ నీటిని నమ్ముకుని వరిని సాగు చేశారు. ఇంకా 15 నుంచి 20 రోజులు నీరు అందితే పంట చేతికొచ్చేది. పంట చూస్తే పచ్చగా కనిస్తున్నప్పటికీ లోపల మొత్తం ఎండి పోయి నెర్రెలు బారుతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గాజర గ్రామానికి చెందిన కొమ్ము వెంకటేశ్ తనకున్న 6 ఎకరాలతోపాటు మరో 6 ఎకరాలను కౌలుకు తీసుకొని 12 ఎకరాల్లో వరిని సాగు చేశాడు. పంట చేతికొచ్చే సమయంలో ప్రాజెక్టులో నీరు దిగువకు పోతుండడంతో పంటకు నీరందని పరిస్థితి ఏర్పడింది. అదేవిధంగా చింతకుంట హుస్సేన్ అనే రైతు తన సోదరులు కలిసి మరో 5 ఎకరాల్లో పంటను సాగు చేశారు. పంట పొట్ట దశలో ఉండగా తీవ్ర వైఖ నీటి ఎద్దడి ఏర్పడింది. దీంతో పొలం కింది భాగంలో నీరు నిల్వ ఉండే ప్రాంతంలో జేసీబీ సహాయంతో బావి రూపంలో తవ్వి ఊరే నీటితో పంటను కాపాడుకునే ప్రయత్నం చేస్తున్నారు. చాలా మంది రైతులు ఇదే పద్ధతిని అవలంబిస్తున్నప్పటికీ రోజుకు రెండు, మూడు మడులు మాత్రమే పారుతుండడంతో మిగతా మడులకు నీరు అందక పోవడంతో ఏం చేయాలో పాలుపోని పరిస్థితి ఏర్పడింది.

నీటి కోసం డిండి బ్యాక్ వాటర్‌లో జేసీబీతో గుంతలు తీస్తున్న రైతులు

ఆశలారిపాయే..

- అడుగంటిన జలం.. ఎండిన పాలం
- ఉమ్మడి జిల్లాలో కానరాని నీటి జాడ
- ఆందోళన చెందుతున్న రైతన్నలు
- సాగునీటి కోసం తప్పని ఆరాటం

వంగూరు, ఏప్రిల్ 8 : కృష్ణమ్మను నమ్ముకొని పంటలను సాగు చేసిన రైతులకు చుక్కెదురైంది. ఎంజీఎల్ఐ ద్వారా వచ్చే నీటితో డిండి ప్రాజెక్టు నీటితో కళకళలాడేది. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం యాసంగిలో డిండిలో నీటిని నిల్వ చేయడంతో డిండి వెనుక భాగం వంగూరు మండలంలోని పలు గ్రామాల రైతులు వరిని సాగు చేసేవారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత నల్ల గొండ జిల్లాకు చెందిన మంత్రుల కారణంగా యాసంగిలో సైతం డిండి నుంచి సాగునీటిని విడుదల చేస్తుండడంతో మండలంలోని పలు గ్రామాల్లో వరి సాగు చేసిన రైతుల పంటలు ఎండిపోయే పరిస్థితి ఏర్పడింది.



గాజరలో నీరులేక ఎండుతున్న వరి పంట

ఎండిన వరి పంటలో గొర్రెలను మేపుతున్న రైతు సంజీవరెడ్డి

బతుకులు ఆగం

మూసాపేట, ఏప్రిల్ 8 : రైతులు సాగు కష్టాలతో ఉక్కిరి బిక్కిరి అవుతున్నారు. పంటలు చేతికందే దశలో సాగునీరు అందరక పంటలు ఎండిపోతున్నాయి. పచ్చని పంటలతో కళకళలాడే పల్లెలు నేడు ఎండుతున్న పంటలతో రైతుల కన్నీటితో తడుస్తున్నాయి. గతంలో ఎన్నడూ లేని విధంగా ఈ యేడు భూగర్భ జలాలు ఒక్క సారిగా అడుగంటి పోవడంతో బోరుబావులన్నీ ఒట్టిపోయాయి. దీంతో పంటలకు సాగునీరు అందక ఎండుతున్నాయి. లక్షలకు లక్షలు పెట్టు బడి పెట్టిన రైతులకు కన్నీళ్లే మిగులుతున్నాయి. మూసాపేట మండలంలోని దాసరిపల్లి అనుబంధ గ్రామం అయిన చెన్నంపల్లి గ్రామానికి చెందిన రైతు సంజీవ రెడ్డికి నాలుగు బోర్లు ఉన్నాయి. రెండు బోర్ల కింద నాగున్నర ఎకరాలు వరి పంటసాగు చేశాడు. ఆ పంట కోత దశలో ఉన్నప్పుడు గతంలో వడ గండ్ల వానతో వడ్లు మొత్తం మడిలోనే రాలిపోయాయి. అదేరైతు మరో రెండు బోరు బావులపై ఆధారపడి మరో చోట అతనికి చెందిన ఎకరం తోపాటు మరో ఎకరం భూమి కౌలుకు తీసుకొని మొత్తం రెండెకరాలు వరి పంట సాగుచేసినట్లు తెలిపాడు. కానీ ఆ రెండు బోరు బావులు ఒక్కసారిగా భూగర్భ జలాలు అడుగంటి పోవడంతో సాగునీరు అందక వరి చేను మొత్తం ఎండుమొఖం పట్టింది. దీంతో చేసేదేమి లేక రైతు ఆ పంటను గొర్రెల మేతకు వదిలేశాడు. ఇలాంటి పరిస్థితి వస్తుందని ఎప్పుడు కూడా ఊహించలేదని, ప్రభుత్వం వడ గండ్ల వానకు దెబ్బతిన్న పంటలతో పాటు ఎండిన పంటలకు సైతం నష్టపరిహారం చెల్లించి ఆదుకోవాలని రైతు సంజీవరెడ్డి ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

డిండిని నమ్ముకొని పంటను సాగు చేశా..

కృష్ణమ్మతో నిండుగా ఉండే డిండి ప్రాజెక్టును నమ్ముకొని రూ.3 లక్షల పెట్టుబడితో 12 ఎకరాల్లో వరి పంటను సాగు చేశాను. పంట ఈనిగింజలు గట్టిపడే సమయంలో తీవ్రమైన నీటి కొరత ఏర్పడింది. ప్రాజెక్టులో నీరు కిందికి పోతున్నాయి. నీరు అందక చేతికి వచ్చిన పంట ఎండి పోతుంటే చూసి తట్టుకోలేక పోతున్నాం. మరో 20 రోజులు నీరు పారితే పంట చేతికొచ్చేది. బీఆర్ఎస్ పాలనలో పంటలు సమృద్ధిగా పండేవి. కాంగ్రెస్ పాలన రైతులకు శాపంగా మారింది.

- కొమ్ము వెంకటేశ్, రైతు, గాజర, వంగూరు మండలం

పంటచేతికొస్తుందన్న నమ్మకం లేదు..

కేసీఆర్ ఉన్నప్పుడు పంటలు మంచిగా పండేవి. నీళ్ల సమస్య వచ్చేది కాదు. అప్పటి లాగే ఉంటుందనకొని మేము వరిని సాగు చేశాం. కాంగ్రెస్ పాలన వచ్చినంక ఏమైందో ఏమో.. కానీ ఏదీ సక్కగ లేదు. నీళ్లు నల్ల గొండ వాళ్లు తీసుకుపోతుండ్రు. దీంతో ప్రాజెక్టు ఎగువ నీటిని నమ్ముకొని వేసిన మా పంటలు ఎండిపోతున్నాయి. ఏం చేయాలో తోచక గుంతలు తీసి ఆ ఊరే నీటితో మడులను తడుపుకుంటున్నాం అన్ని మడులకు నీరు అందడం లేదు. పంట చేతికొస్తుందన్న నమ్మకం కూడా లేదు.

- హుస్సేన్, రైతు, గాజర, వంగూరు మండలం

ఆత్మకూర్‌లో దారుణం

- ప్రసవానికి ముందే శిశువు తల, మొండెం వేరు
- రెండు ప్రభుత్వ దవాఖానలు దాటి ప్రైవేట్‌కు వెళ్లినా తప్పని శోకం
- ప్రభుత్వ వైద్యశాల సిబ్బంది నిర్లక్ష్యమే కారణమంటున్న కుటుంబ సభ్యులు

బాలింతతో వివరాలు తెలుసుకుంటున్న డీఎంహెచ్‌వో

అమరచింత, ఏప్రిల్ 8 : ప్రసవం కోసం ప్రభుత్వ దవాఖానలకు వెళ్లిన మహిళకు వైద్యులు, సిబ్బంది సకాలంలో వైద్యం అందించక పోవడంతో ప్రైవేట్ దవాఖానను ఆశ్రయించినా గర్భశోకం తప్పని దారుణ ఘటన ఆత్మకూర్‌లో చోటు చేసుకున్నది. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం అమరచింత మండలంలోని చంద్ర ఫణ్‌కు చెందిన అనిత ప్రసవం కోసం అమరచింత ప్రభుత్వ దవాఖానకు వచ్చింది. డ్యూటీలో ఉన్న స్టాఫ్ నర్స్ (వసంత) ప్రసవం కోసం వచ్చిన మహిళను పరీక్షించి ఇంజక్షన్ ఇచ్చి సెలెన్ బాటిల్ పెట్టి ప్రసవం చేసే ప్రయత్నం చేయగా శిశువు కాళ్లు మాత్రమే బయటకు రావడంతో కాన్పు కష్టతరం అవుతున్నదని గుర్తించి ఇక్కడ వైద్యులు కూడా అందుబాటులో లేరని వెంటనే వనపర్తిలోని ఎంసీహెచ్‌కు తీసుకుపోవాలని రెఫర్ చేసింది. దీంతో కుటుంబ సభ్యులు గర్భిణిని అక్కడి నుంచి 108లో వనపర్తి తరలిస్తుండగా పురిటి నొప్పులు ఎక్కువ కావడంతో నేరుగా ఆత్మకూర్ ప్రభుత్వ దవాఖానకు తీసుకుపోయారు. అక్కడ కూడా పరీక్షించిన వైద్యులు ఆపరేషన్ చేయాల్సి వస్తుందని వెంటనే వనపర్తి జిల్లా దవాఖానకు తీసుకుపోవాలని సూచించారు. కుటుంబ సభ్యులు వనపర్తికి వెళ్లకుండా పట్టణంలోని ప్రైవేట్ దవాఖానను ఆశ్రయించారు. అప్పటికే శిశువు తల మినహా మొండెం వరకు పూర్తిగా బయటకు రావడంతో అందుబాటులో ఉన్న వైద్యులు పరీక్షించి గైనకాల జ్యోతి విజయలక్ష్మిని పిలిపించి ఆపరేషన్ చేసి తల మొండెం వేరు చేసి శిశువును బయటకు తీశారు. రెండు ప్రభుత్వ దవాఖానల్లో వైద్యులు అందుబాటులో లేక పోతడంతో ప్రైవేట్ దవాఖానను ఆశ్రయించిన మహిళకు గర్భశోకం తప్పలేదు. అమరచింతలోని ప్రభుత్వ దవాఖానలో 24 గంటలు వైద్యులు అందుబాటులో ఉండి ఉంటే ఈ పరిస్థితి వచ్చేది కాదని, ఆత్మకూర్‌లోనూ అదే పరిస్థితి నెలకొందని, ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లే తాము తమ శిశువును కాపాడుకోలేక పోయామని కుటుంబ సభ్యులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అయితే ప్రైవేట్ దవాఖానలో వైద్యం వికటించి శిశువు మృతి అంటూ సోషల్ మీడియాలో వార్త వైరల్ కావడంతో డీఎం హెచ్‌వో శ్రీనివాసులు దవాఖానకు వచ్చి బాధితులు, వైద్యుల నుంచి వివరాలు సేకరించారు. సీసీ ఫుటేజీని పరిశీలించిన అనంతరం దవాఖానపై తగిన చర్యలు తీసుకుంటామని డీఎం హెచ్‌వో వెల్లడించారు. ఈ విషయంపై ప్రైవేట్ దవాఖానకు చెందిన వైద్యుడు సుబ్బారెడ్డిని వివరణ కోరగా పురిటి నొప్పులు రావడంతో రెండు దవాఖానలకు తిరిగి మధ్యరాత్రి 12:20కి తమ దవాఖానకు వచ్చిన అనితకు అప్పటికే శిశువు పూర్తిగా బయటకు వచ్చి కేవలం తల మాత్రమే మిగిలిపోయిందని, వనపర్తి వెళ్లేందుకు లేటు అవుతుందని, తల్లి ప్రాణాలు కాపాడాలని కుటుంబ సభ్యులు ప్రాదేయపడడంతో వైద్యుల సూచనతో తమ దవాఖానలో చేర్చుకొని ప్రసవం చేసి తల్లిని కాపాడినట్లు ఆయన తెలిపారు.

ఇందిరమ్మ ఇండ్ల కోసం ఆందోళన

ఊర్కొండ, ఏప్రిల్ 8 : మండలంలోని నర్సంపల్లిని పైలట్ గ్రామంగా ప్రభుత్వం ప్రకటించింది. అందులో భాగంగా ఇండ్లులేని వారికి ఇందిరమ్మ పథకం కింద ఇండ్లు కట్టిస్తానని ప్రభుత్వం చెప్పడంతో మణెమ్మ, దార లక్ష్మయ్య, రజితలు తాము నివాసం ఉంటున్న ఇండ్లను సైతం కూలగొట్టుకొన్నారు. తీరా ఇండ్ల లిస్టులో తమ పేర్లు రాకపోవడంతో గ్రామ కార్యదర్శిని నిలదీశారు. మీ పేర్లు సెకండ్ లిస్టులో వస్తాయని చెప్పడంతో అవాక్కయ్యారు. వచ్చేది వానకాలం.. మేము ఎక్కడ ఉండాలని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇందిరమ్మ ఇండ్ల లిస్టుతో ముందు తమ పేర్లు వచ్చాయని తీరా ఇండ్లు కూల గొట్టుకున్న తర్వాత లిస్టులో పేర్లు మాయమయ్యాయని, లిస్టులో పేర్లు లేనివారికి బేస్‌మెంట్ వరకు బిల్లులు కూడా వచ్చాయని ఇదెక్కడి న్యాయమని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తమకు ఇందిరమ్మ ఇండ్లను కేటాయించాలని డిమాండ్ చేస్తూ మంగళవారం ఎండీపీవో కార్యాలయం ఎదుట వారు ఆందోళన నిర్వహించారు. ఎంపీడీవో స్పందిస్తూ ఈ విషయాన్ని ఉన్న తాధికారుల దృష్టికి తీసుకు పోయి మీకు న్యాయం జరిగేలా చూస్తామని హామీ ఇచ్చారు.

కొన..సాగుతున్న డీవాటరింగ్

- ఎస్ఎల్‌బీసీలో 46 రోజులుగా సహాయ చర్యలు

అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న టన్నెల్ ప్రత్యేకాధికారి శివశంకర్

నాగర్‌కర్నూల్/అచ్చంపేట, ఏప్రిల్ 8 : అమ్రాబాద్ మండలంలోని దోమల పెంట వద్ద ఎస్ఎల్‌బీసీ సొరంగ ప్రమాద ప్రదేశంలో చిక్కుకున్న వారి ఆచూకీ తెలుసుకునేందుకు 46వ రోజులుగా సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. టన్నెల్ లోపల చివర 70మీటర్లు అత్యంత ప్రమాదకరంగా మారడంతో అక్కడ సహాయక చర్యలు నిలిపివేశారు. నీటి ఊట అడ్డంకిగా మారడం పైనుంచి కూలిపడే ప్రమాదం ఉండడంతో అక్కడి వరకు కంచె ఏర్పాటు చేశారు. మిగిలిన ప్రదేశాల్లో సహాయక చర్యలను కొనసాగిస్తున్నారు. ప్రత్యేకాధికారి శివశంకర్ లోతేటి మంగళవారం ఎస్ఎల్‌బీసీ టన్నెల్ ఇన్లెట్ ఒకటి వద్ద సహాయక బృందాల ఉన్న తాధికారులతో కలిసి సహాయక చర్యలపై సమీక్ష నిర్వహించారు. సమావేశంలో ఆర్మీ అధికారులు జేపీ కంపెనీ సీనియర్ ప్రాజెక్టర్ ఇంజినీర్ సంజయ్‌కుమార్ సింగ్, ఎస్డీఆర్ఎఫ్ అధికారి గిరిధర్‌రెడ్డి, సింగిరేణి మైన్స్ రెస్క్యూ అధికారులు, హైడ్రా అధికారి, దక్షిణ మధ్య రైల్వే అధికారి పాల్గొన్నారు.

అనంతవరం శివారులో ప్రాజెక్టు సర్వే పనులను అడ్డుకుంటున్న నిర్వాసిత రైతులు

ప్రాణాలు పోయినా ప్రాజెక్టు కట్టనివ్వం

- ఉమామహేశ్వరం రిజర్వాయర్ నిర్మిస్తే సర్వం కోల్పోతాం
- అనంతవరం శివారులో సర్వే పనులు అడ్డుకున్న మూడు గ్రామాల రైతులు

అచ్చంపేటరూరల్, ఏప్రిల్ 8 : ఉమామహేశ్వర ప్రాజెక్టులో చేపడుతున్న రిజర్వాయర్ వల్ల బల్మూరు మండల రైతులకు లాభం కంటే నష్టం ఎక్కువ జరుగుతుందని దాదాపు 2,067ఎకరాల్లో రెండు పంటలు పండించే భూములను కోల్పోయి రోడ్డున పడే పరిస్థితి రానున్నదని నిర్వాసిత రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అందుకే తమ ప్రాణాలు పోయినా రిజర్వాయర్ పనులను కొనసాగనివ్వమని మంగళవారం నిర్వాసిత రైతులు భూములను సర్వే చేయడానికి వచ్చిన అధికారులను అడ్డగించిన ఘటన అచ్చంపేట నియోజకవర్గం బల్మూరు మండలం అనంతవరంలో చోటు చేసుకున్నది. అనంతవరం, అంబగిరి, బల్మూరు రైతులు రామకృష్ణ, శేఖర్‌రెడ్డి, స్వామి, తిరుతయ్య తెలిపిన వివరాల ప్రకారం 2067 ఎకరాల భూములు కోల్పోతుండగా మండలం లో మొత్తం కేవలం 360ఎకరాలకు నీరు పారే అవకాశం ఉందని ప్రాజెక్టు కింద ఎక్కువ మంది సన్న చిన్న కారు ఎస్సీ, ఎస్టీ, బీసీ రైతులు అధికంగా ఉన్నారన్నారు. ప్రాజెక్టును నిలుపుదల చేయాలని కోర్టుకు వెళితే ఫీసా యాక్ట్ ఏసీటీ 2011, రిస్టి లల్ ఆక్ట్ ఏసీటీ 2013 ప్రకారంగా ఇక్కడ భూములు కోల్పోయే ఎస్సీ, ఎస్టీ నిర్వాసిత రైతులకు సరిసమానంగా సేద్యం చేసుకునే భూములను ఇచ్చిన తర్వాతనే రిజర్వాయర్ ప్రాజెక్టు పనులను ప్రారంభించాలని కోర్టు ఆర్డర్ ఇవ్వగా వాటిని ధిక్కరించి స్థానిక ఎమ్మెల్యే వంశీకృష్ణ ప్రాజెక్టు పనులను ప్రారంభించడానికి భూమి పూజ చేయడం ఎంత వరకు సమంజసమని నిర్వాసిత రైతులు ప్రశ్నించారు. బల్మూరు మండలం నుంచి ఎమ్మెల్యే సొంత మండలం అమ్రాబాద్‌కు నీటిని తరలించుటకు ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. ఇక్కడి రైతుల పొట్టకొట్టి అక్కడి రైతులకు సాగు నీరు తీసుకెళ్లడం భావ్యం కాదన్నారు. గతంలో కేఎల్ఐ ప్రాజెక్టు చంద్ర సాగర్ లిఫ్ట్ ద్వారా1.5 కిలో మీటర్లు కాల్వ తవ్వితే సాగు నీరు తీసుకోవచ్చన్నారు. నిర్వాసిత రైతులకు సరైనా పరిహారం అందించకుండా భూమిని సేకరించే అధికారం ప్రభుత్వాలకు లేదని సుప్రీం కోర్టు న్యాయమూర్తులు జస్టీస్ బీఆర్ గవాయ్, కేవీ విశ్వనాథన్ ధర్మాసనం 23/11/2023లో తీర్చునిచ్చినట్లు గుర్తుచేశారు. 2021నుంచి ఇప్పటి వరకు ఈ ప్రాజెక్టు నిర్మించవద్దని రైతులు పోరాటం చేస్తూనే ఉన్నారని గుర్తు చేశారు. ఈ ప్రాజెక్టుకు ప్రత్యామ్నాయంగా రుసుల్‌చెరువు గానీ, బేచిరాగ్ గ్రామ వైఖ రామ గిరి ప్రాంతంలో రిజర్వాయర్ నిర్మించాలని రైతులు సూచించారు. ఎన్నికలముందు ఎమ్మెల్యే వంశీకృష్ణ కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ప్రాజెక్టు నిర్మాణం నిలిపివేసి భూ నిర్వాసితులకు న్యాయం చేస్తానని ప్రతిపక్షంలో ఉండగా రైతులకు హామీ ఇచ్చారని, తీరా మాట మార్చి ప్రాజెక్టు పనులకు పోలీసు పహారాలో భూమిపూజ చేయడం అన్యాయమన్నారు.

సీజ్ చేసిన దవాఖానలో వైద్యసేవలు

- ముందు భాగంలో సీజ్.. వెనుక నుంచి చికిత్సలు

సత్యసాయి దవాఖానలో కొనసాగుతున్న వైద్య సేవలు

దేవరకద్ర, ఏప్రిల్ 8 : దేవరకద్ర మండల కేంద్రంలోని పలు ప్రైవేట్ దవాఖానలను రాష్ట్ర మెడికల్ కౌన్సిల్ వైస్‌చైర్మన్ శ్రీనివాస్, జిల్లా మాస్ మీడియా అధికారి మంజుల సోమవారం తనిఖీ చేశారు. అయితే పట్టణంలోని సత్యసాయి, అమ్మ క్లినిక్, సాయి క్లినిక్ హోమియోపతి చేసిన వైద్యులు దవాఖానకు వచ్చే రోగులకు అల్లోపతి వైద్యం అందిస్తున్నట్లు వారు గుర్తించారు. అంతే కాకుండా సత్యసాయి క్లినిక్ వైద్య శాఖ నుంచి ఎలాంటి అనుమతి తీసుకోకుండా 10 బెడ్లు ఏర్పాటు చేసి అర్హతకు మించిన వైద్య సేవలు అందిస్తున్నట్లు గుర్తించి మూడు క్లినిక్‌కు వారు సీజ్ చేశారు. కానీ మంగళవారం సీజ్ చేసిన సత్యసాయి దవాఖానలో అధికారులు క్లినిక్‌కు వేసిన సీల్‌ను అలాగే ఉంచి వెనుక నుంచి రోగులకు వైద్య సేవలు అందిస్తుండడం కనిపించింది. మిగతా రెండు దవాఖానల్లో కూడా వైద్య సేవలు కొనసాగుతున్నట్లు తెలిసింది. దీనిపై వెంటనే జిల్లా మాస్ మీడియా అధికారి మంజులను వివరణ కోరగా దేవరకద్రలో సీజ్ చేసిన మూడు దవాఖానల్లోనూ నకిలీలు వైద్యులుగా చలామణి అవుతున్నట్లు గుర్తించినట్లు చెప్పారు. ఆ దవాఖానల్లో రోగులకు వైద్య సేవలు అందిస్తే మా దృష్టికి తీసుకురావాలని వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని వెల్లడించారు.

మనస్తాపంతో విద్యార్థిని ఆత్మహత్యాయత్నం

- కేజీబీవీ ఎదుట విద్యార్థి, ప్రజాసంఘాల ధర్నా

నాగర్‌కర్నూల్ రూరల్, ఏప్రిల్ 8 : నాగనూల్ కేజీబీవీలో 9వ తరగతి చదువుతున్న విద్యార్థి యామినిని స్టడీ అవర్స్‌కు ఆలస్యంగా వచ్చిందనే కోపంతో ఇంగ్లిష్ టీచర్ 3 గంటలపాటు కదలనీయకుండా బయట నిల్చోబెట్టింది. ఆలస్యంగా రావడానికి గల కారణం చెప్పిన సదరు ఉపాధ్యాయురాలు వినిపించుకోలేదని సమాచారం. తాను ఇతర టీచర్లతో ఫ్రెండ్లీగా ఉండడంతో టీచర్ గురించి వారికి ఏదో చెబుతుందని మనస్సులో పెట్టుకొని వేధింపులకు పాల్పడిందని.. దాహం వేస్తుందన్నా.. వాష్ రూమ్‌కు వెళ్లివస్తానన్నా అనుమతి ఇవ్వకుండా విద్యార్థినుల ఎదుట హేళన చేస్తూ మాట్లాడడంతో మనస్తాపంతో చెందిన సదరు విద్యార్థిని కత్తితో చేతిని కోసుకుని ఆత్మహత్యా యత్నానికి పాల్పడినట్లు తెలిసింది. ఈ విషయం తెలుసుకొని తల్లిదండ్రులు మంగళవారం పాఠశాలకు వచ్చి విద్యార్థినితో మాట్లాడారు. తనను అకారణంగా వేధిస్తున్నట్లు ఆమె వాపోయింది. దీంతో విద్యార్థి, ప్రజాసంఘాలతో కలిసి ధర్నాకు దిగారు. తమ కుమార్తెను అవమానపర్చి ఆత్మహత్యాయత్నానికి కారణమైన టీచర్‌ను వెంటనే విధుల నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. విషయం తెలుసుకొన్న డీఈవో రమేశ్‌కుమార్ పాఠశాలకు వెళ్లి ఉపాధ్యాయులతో సమీక్ష నిర్వహించారు. విద్యార్థి పట్ల అమానవీయంగా ప్రవర్తించిన టీచర్ విషయం కలెక్టర్‌తో మాట్లాడి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

టీచర్‌కు షోకాజ్ నోటీస్

నాగర్‌కర్నూల్, ఏప్రిల్ 8: నాగనూలు కస్తూర్బాలో 9వ తరగతి విద్యార్థిని స్టడీ హవర్స్‌కు లేటుగా వచ్చిందన్న కారణంగా మూడు గంటలపాటు నిలబెట్టి ఇబ్బందులకు గురిచేసిన టీచర్ కల్యాణికి షోకాజ్ నోటీసులు ఇచ్చారు. విషయం తెలుసుకొన్న డీఈవో రమేశ్ మంగళవారం జిల్లా బాలిక అభివృద్ధి అధికారిణి శోభారాణితో కలిసి పాఠశాలకు వెళ్లి విచారణ చేపట్టారు. ఉపాధ్యాయులు విద్యార్థులతో